
# పాపం... ముకుందం!




బెండపూడి రమేష్‌బాబు

"మీరు చేసిన తప్పు తెలిస్తే యింటి ఓనర్‌గారేమనుకుంటారో అని భయంగా వుందండీ" అంది మీనా భర్త నుద్దేశించి కోపంగా.

"జరిగిన విషయం గురించి దేనికి చెప్పు. జరగాల్సిన విషయం గురించి ఆలోచించాలి మనం" అన్నాడు విసుగ్గా గోపీ.

"ఏం..ఆలోచించినా ప్రయోజనం ఏముంది చెప్పండి. జరగాల్సిన తప్పు జరిగిపోయింది. దాని పర్యవసానం ఏదైనా భరించాల్సిందే కదా" అంది మీనా. అతను మౌనంగా మిన్నకుండి పోయాడు.

ఆమె ఆలోచన్ల తుపానులో చిక్కుకుంది.

నిశ్శబ్దం వాళ్ళిద్దరి మధ్యకీ చుట్టపు చూపుగా వచ్చింది.

పక్క పోర్షన్‌లో వుండే ఆ యింటి ఓనర్ ముకుందం చెవిలో ఈ మాటలు పడనేపడ్డాయి. సభ్యత కాదని తెలిసినా వాళ్ళ సంభాషణ వినాలనే కుతూహలం అతన్లో చోటుచేసుకుంది. చెవులు రిక్కించి మరీ వినసాగాడు.

అటువైపునుండి వులుకూ పలుకూ లేదు.

గోపీ ఏదో తప్పు చేసినట్టున్నాడు. లేకపోతే భర్తనుద్దేశించి మీనా అంత గట్టిగా మాట్లాడదు. మీనాక్కోపం తెప్పించేటంత తప్పు గోపీ ఏం చేసి వుంటాడు. అదేమిటో తెలుసుకోవాలనే ఆతృత అతన్లో పెరిగిపోయింది.

ముకుందం ఓ రిటైర్డ్ ప్రభుత్వ వుద్యోగి. రిటైర్మెంట్‌తో వచ్చిన డబ్బు పెట్టి రెండు పోర్షన్ల డాబా కొనుక్కుని అందులో ఓ పోర్షన్ ఆ యువదంపతులకు అద్దెకి యిచ్చాడు. అతని భార్య ఈమధ్యనే కాలం చేసింది. ఒక్కగానొక్క కొడుకు బెంగుళూర్లో బాగా స్థిరపడ్డాడు.

మొన్నీమధ్య మీనా తన పుట్టింటికి పోయింది. వారం దాకా రాలేదు. అంటే తనూ, మీనా లేని సమయం చూసుకొని గోపీ ఏదో తప్పు చేసి వుంటాడు. మీనా అడిగే తీరును బట్టి చూస్తే గోపీ చేసిన తప్పు ఒక్కటే ఒక్కటి అయ్యి వుండాలి. అదే అతను తన మగబుద్ధి ప్రదర్శించి వుండాలి. లేకపోతే ఎందుకు మీనా తన భర్తనంత క్రాస్ ఎగ్జామ్ చేస్తుంది. తెలివిగల పిల్ల కాబట్టే సంసారాన్ని బజారుకీడ్చుకోకుండా గుట్టుగా విషయాన్ని రాబడుతోంది. గోపీ చాలా మంచివాడనుకొన్నా గానీ, గ్రంథసాంగుడిలా వున్నాడే. అయినా యింత అందమైన భార్యని యింట్లో పెట్టుకుని, ఈ కక్కుర్తి బుద్ధులేందో? పిదపకాలం, పిదప బుద్ధులు. కాకపోతే మరేంటీ అనుకొన్నాడు ముకుందం. వాళ్ళ సంభాషణ మళ్ళీ ముకుందం చెవిన సోకింది.

"డాడీ యింత పెద్దవయస్సులో అవస్థలు పడుతూ మీరొక్కరే అక్కడ ఎందుకు చెప్పండీ..మా దగ్గరికి వచ్చేయచ్చుకదా" అని కొడుకెన్నిసార్లు బ్రతిమాలినా వున్న ఊరిపై మమకారం అతన్ని ఆ వూరు విడిచి వెళ్ళకుండా చేసింది.

పక్క పోర్షన్లోనుండి ఆ యువదంపతుల మాటలు వినిపించసాగాయి ముకుందానికి.

"మిమ్మల్ని ఒంటరిగా వొదిలి వెళ్ళాలంటే నాకు అందుకే భయం" అతను మౌనంగా ఆమె మాటలు వినసాగాడు.

"ఇంటి ఓనర్‌గారికి జరిగిన విషయం తెలుసా?"

"ఊహూ..తెలీదు"

"తెలియదని మీకు ఎలా తెల్సు"

"ఆ విషయం జరిగిన రాత్రి ఆయన తన చుట్టాల యింట్లో పడుకున్నాడు. ఆ రాత్రి యింటికి రాలేదు"

మళ్ళీ వాళ్ళిద్దరూ సైలెంటయిపోయారు.

వాళ్ళ సంభాషణ వింటున్న ముకుందం గట్టిగా ఓ నిర్ణయానికి వచ్చాడు. గోపీ చెయ్యకూడని తప్పు ఏదో ఖచ్చితంగా చేసి వుంటాడు.

"ఓనర్‌గారికి జరిగిన సంగతి వివరిద్దామండీ"

"ఆయన సీరియస్ అయి యిల్లు ఖాళీ చేయమంటే"

"చేసేది ఏముంది. ఖాళీ చెయ్యమంటే మనం మాత్రం సిగ్గులేకుండా గుమ్మానికేం వ్రేలాడతామా? యివాళ కాకపోతే రేపయినా నిజం దాగదుగా? అప్పుడు మనపై వున్న గౌరవం పూర్తిగా పోదా! చెప్పండి"


"ఇది దాచినా దాగే విషయం కాదని నాకూ తెల్సు. ఆయనకి బీపీ ఎక్కువ. విషయం విని ఎక్కడ సీరియస్ అవుతాడో అనే ఆలోచిస్తున్నా"

"ఆయన సీరియస్ అవుతారని దాస్తే దాగే విషయమా? మీరు వెలగబెట్టిన నిర్వాకం రేపెప్పుడో పాలవాడో, పనిమనిషో చెప్పరా?"

"సరే..జరిగిందేదో జరిగిపోయింది. విషయాన్ని జాగ్రత్తగా ట్యాకిల్ చెయ్యాలి. అసలే మెంటల్ వోనర్. ఎందుకంటే మొన్నకి మొన్న బురద కాళ్ళతో యింట్లోకి వచ్చానని తెలిసి నన్ను నిలబెట్టి ఓ క్లాసు పీకాడునుకో. నాకయితే భలే కోపం వచ్చింది. ఏదో పెద్దవాడులే అనీ వూరుకొన్నా" అన్నాడు గోపీ.

ముకుందానికి గోపీపై కోపం ముంచుకొచ్చింది. ఓనర్ననే గౌరవం లేకుండా గోపీ మాట్లాడే





తీరే నచ్చలేదు.

పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో వుండి వేలెత్తి చూపే ప్రవర్తన కలిగివుండటం క్షమార్హం కాదు. పాపం యితని మగబుద్ధికి బలైపోయిన అభాగ్యురాలెవరో అనుకొన్నాడు ముకుందం.

"బాబాయ్‌గారూ!" అన్న పిలుపుతో వూహల చట్రం నుండి బయటపడ్డాడు ముకుందం.

కుశల ప్రశ్నలన్నీ పూర్తయ్యాక మీనా అందుకొని "బాబాయ్‌గారూ..ఓ పొరపాటు జరిగిందండీ..పెద్దవారు.మీరీ విషయం విని ఆవేశపడరుగా" అంది ముందు కాళ్ళకి బంధం వేస్తూ.

మీనా జరిగిన విషయం ఎప్పుడెప్పుడు చెబుతుందా? గోపీకి నాలుగు చీవాట్లుపెట్టి మీనా దగ్గర మార్కులు కొట్టెయ్యాలని వుబలాటంగా వుంది ముకుందానికి.

"గోపీ..ఏం తప్పు చేసాడమ్మా" అన్నాడు ముకుందం గోపీ వైపు కొరకొరా చూస్తూ.

ఆమె యింటి ఓనర్ వైపు చూస్తోంది.

గోపీ తన కాలిబ్రొటన వ్రేలుతో నేలపై వృత్తాలు గీయసాగాడు.

"చెప్పమ్మా..మీనా..నీ తండ్రిలాంటివాడిని. ఏ సంకోచం పెట్టుకోకుండా చెప్పు..వీలైతే నాకు చేతనైన ఏ సహాయం చెయ్యగలనో ఆలోచిస్తా" అన్నాడు.

మీనా చెప్పబోయే విషయం ఏంటో తెల్సుకోవాలనే వుబలాటం ఓ వైపూ..గోపీకి యింటి ఓనర్ల తడాఖా ఏమిటో తెలిసి వచ్చేలా క్లాస్ పీకాలనే ఆనందం మరో వైపూ ముకుందాన్ని వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆమె చెప్పుకుపోసాగింది.

"బాబాయ్‌గారూ..మొన్నీ మధ్య నేను పుట్టింటికి పోయానా? ఓ రోజు ఈయన గ్రైండర్ శుభ్రం చేద్దామనుకొని గ్రైండర్లో వున్న రుబ్బురోలు తీస్తే..అది కాస్తా స్లిప్పయ్యి కింద పడి టైల్స్ అన్నీ పగిలిపోయాయి. ఆ విషయం తెలిస్తే మీరెక్కడ హర్ట్ అవుతారో అని చెప్పలేదుట" అంది.

ఏదేదో వూహించుకొని తెగ మురిసిపోతున్న ముకుందానికి మీనా చెప్పిన మాటలు నిస్పృహని కలిగించాయి.

అతని వుత్సాహంపై నీళ్ళు చల్లినట్లయ్యింది.

ఇదా వీళ్ళింతసేపూ తర్జన భర్జన పడిన విషయం. ఇంకానయం తొందరపడి తనేం అనలేదు గోపీని. పరువుపోయేది అనుకొన్నాడు.

"బాబాయ్‌గారూ..వంటింట్లో ఫ్లోరింగ్ అంతా మా సొంత ఖర్చులతో మేమే బాగు చేయిస్తాం. ఇలా జరిగినందుకు మాకూ బాధగానే వుంది. ఏం చేస్తాం..అనుకోకుండా యిలాంటి పొరపాట్లు అప్పుడప్పుడూ జరుగుతూనే వుంటాయి. ఏమి అనుకోకండీ..ప్లీజ్" అంది రిక్వెస్ట్‌గా.

భార్య సమయస్ఫూర్తికి ముచ్చటేసింది గోపీకి.

గోపీని చూస్తే అరికాలి మంట నెత్తికెక్కుతోంది ముకుందానికి. బాగా క్లాస్‌పీకే ఛాన్స్ మిస్సయ్యిందే అనే బాధగావుంది.

"అలాగేనమ్మా..దాన్దేముంది. మనిషన్నాక పొరపాట్లు ఎవరికైనా సహజమే కదా? మీరేమన్నా కావాలని చేసారా? చెప్పు...అనుకోకుండా జరిగేదానికి ఎవరేం చేస్తారు చెప్పు" అన్నాడు మొహాన నవ్వు పులుముకుంటూ.

"థాంక్సండీ..బాబాయిగారూ! మీరెక్కడ సీరియస్ అయిపోతారో అని తెగ హడలి చచ్చాం..ఎంతైనా మీది పెద్దమనసని నాకు తెల్సు. అందుకే మా బాధను అర్థం చేసుకొన్నారు వెళ్ళొస్తామండి" అని లేచి వెళుతున్న ఆ దంపతుల వైపు అలాగే చూస్తూ వుండిపోయాడు పాపం... ముకుందం.